

దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాలు: డీఈవో

కలెక్టరేట్, ఏప్రిల్ 11: సమగ్ర శిక్ష- విద్యా శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాలు ఇచ్చేందుకు ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు డీఈవో ప్రేమకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 12న గరివిడి క్లస్టర్ పరిధిలోని మండలాల వారికి భవితా కేంద్రం వద్ద శిబిరం ఉంటుందని పేర్కొన్నారు. రాజాం క్లస్టర్ పరిధిలో రాజాం భవితా కేంద్రం వద్ద శిబిరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 15న గజపతినగరం క్లస్టర్ పరిధిలోని మండలాలకు రామభద్రపురం భవితా కేంద్రం వద్ద శిబిరం నిర్వహిస్తామన్నారు. 18న డెంకాడ భవితా కేంద్రం వద్ద ఆ క్లస్టర్ మండలాల విద్యార్థులకు ఏర్పాటు చేశామన్నారు.



గరివిడి- చీపురుపల్లి రోడ్డులో ప్రభుత్వ స్థలం ఆక్రమించి నిర్మించిన దుకాణాలు

సర్కారు స్థలాలు కబ్జా

- చీపురుపల్లిలో యథేచ్ఛగా దుకాణాల నిర్మాణం
- విచారణ లేకుండా వాటికి విద్యుత్ కనెక్షన్లు మంజూరు
- ఒకరిని చూసి ఒకరు ఇదే పంథా

అక్రమ నిర్మాణాలపై చర్యలు

గరివిడి మండలంలోని కోడూరు రెవెన్యూ పరిధిలోని సర్వే నం.1/4లో ఉన్న ఆక్రమణలపై తగిన చర్యలు తీసుకుంటామని గరివిడి ఆర్ఐ కంది అచ్యుతరావు తెలిపారు. ప్రాథమికంగా గుర్తించిన స్థలంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామని, సమగ్రంగా రికార్డులు పరిశీలించాక, అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటా మన్నారు. ఆక్రమణదారులపైనా చర్యలుంటాయన్నారు.

రికార్డులు పరిశీలించి చర్యలు

చీపురుపల్లి ఆక్రమణలపై ఆర్ఐ రామ్‌కుమార్ మాట్లాడుతూ చీపురుపల్లి పరిధిలో మెయిన్ రోడ్డుకు ఆనుకొని ఆర్ అండ్ బీ స్థలాలున్నాయన్నారు. ఒకసారి రికార్డులు పరిశీలించి, రెవెన్యూ స్థలాల్లో ఆక్రమణలున్నట్టు నిర్ధారణ అయితే తప్పకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

సర్కారు స్థలాల ఆక్రమణ... కోట్ల రూపాయల సంపాదన.. చీపురుపల్లిలో ప్రస్తుతం నడుస్తున్న ట్రెండ్ ఇదీ.. పట్టణంలోని విజయనగరం- పాలకొండ ప్రధాన రోడ్డుకు ఆనుకొని ఉన్న సర్కారు స్థలాల్లో కొందరు కబ్జాదారులు పాగా వేశారు. ఆక్రమించి ఆపై దుకాణాల నిర్మాణాలకు పూనుకున్నారు. తద్వారా ఆ స్థలాన్ని సులువుగా సొంత చేసుకోవచ్చునని ఎత్తు వేశారు. విద్యుత్ శాఖ అధికారులు సమగ్రంగా పరిశీలించకుండా కరెంటు కనెక్షన్ కూడా మంజూరు చేసేస్తున్నారు. ఈ భూ వ్యవహారాలకు కొందరు అధికార పార్టీ నాయకులు సహకరిస్తున్నట్లు సమాచారం. వారి అండ చూసుకునే ఆ వ్యక్తులు భూములపై పడుతున్నట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. ఎవరైనా ప్రశ్నిస్తే దాడులకు దిగుతున్నారని స్థానికులు వాపోతున్నారు.



చీపురుపల్లి: ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన రెవెన్యూ సిబ్బంది

(చీపురుపల్లి)

చీపురుపల్లిలో భూముల ధరలు కొంతకాలంగా అమాంతం పెరుగుతూ పోతున్నాయి. చీపురుపల్లి- గరివిడి పట్టణాల మధ్య కోట్ల రూపాయలు విలువ చేసే ప్రభుత్వ స్థలాలున్నాయి. వాటిని కొంతమంది వ్యక్తులు కబ్జా చేస్తున్నారు. నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి, ఆక్రమిత స్థలాల్లో దుకాణాలు నిర్మిస్తున్నారు. రోడ్డు పక్కనున్న ఈ స్థలాలు వ్యాపారానికి అనువైనవి కావడంతో దుకాణాలు నిర్మించి, వేల రూపాయాలకు అద్దెకిస్తున్నారు. లేదంటే లక్షల రూపాయలకు విక్రయిస్తున్నారు. భూ ఆక్రమణలపై ఇటీవల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు అందింది. ఆ మేరకు కోడూరు రెవెన్యూ పరిధిలోని సర్వే నం.1/4లో గరివిడి తహసీల్దారు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. అయినా కూడా అదే సర్వే నంబరులో వివిధ చోట్ల ఆక్రమణలు కొనసాగుతున్నాయి. ఇదిలా ఉండగా, చీపురుపల్లి మండలం, ఆంజనేయపురంలో సర్వే నం.32/7లో జిరాయితీ స్థలానికి ఆనుకొని ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కొంతమంది దౌర్జన్యంగా ఆక్రమించారు. ఆ స్థలాన్ని వ్యాపారాలకు అద్దెకిస్తూ డబ్బులు సంపాదిస్తున్నారు. ఇదేమని అడిగిన స్థలం యజమానులపై ఆక్రమణదారులు ఇటీవల దాడికి కూడా తెగపడినట్టు తెలిసింది. ఈ విధంగా రోడ్డుకిరువైపులా ఉన్న విలువైన ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురై, ఆక్రమణదారులకు రూ.లక్షలు, రూ.కోట్లు తెచ్చిపెడుతున్నాయి.

- ప్రధాన రహదారికిరువైపులా ప్రభుత్వం స్థలాలు ఈ విధంగా కబ్జా గురవ్వడం ఒక ఎత్తైతే, ఆక్రమణల్లో ఉన్న ప్రభుత్వ స్థలాల్లోని నిర్మాణాలకు ఎటువంటి క్షేత్ర స్థాయి పరిశీలన లేకుండానే సంబధిత అధికారులు విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేసేస్తున్నారు. సొంత స్థలాల్లో నిర్మించుకున్న దుకాణాలకు గాని, ఇళ్లకు గాని విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయడంలో సవాలక్ష ప్రశ్నలు వేసే విద్యుత్ శాఖ అధికారులు, ప్రభుత్వ స్థలాల్లోని నిర్మాణాలకు ఎటువంటి విచారణ లేకుండా కనెక్షన్లు ఇవ్వడం అనుమానాలకు తావిస్తోంది.
- నిబంధనల ప్రకారం విద్యుత్ కనెక్షన్ మంజూరు చేసే ముందు సచివాలయం నుంచి ఎన్ఓసీ తీసుకోవాలి. అయితే ప్రభుత్వం నుంచి ఆ స్థలంపై ఎటువంటి డాక్యుమెంట్లు లేని ఆక్రమణదారులు సచివాలయంలో ఏ విధంగా ఎన్ఓసీ పొందుతున్నారో ప్రశ్నార్థకంగా ఉంది. ఈ మొత్తం వ్యవహారమంతా అధికార పార్టీకి చెందిన కింది స్థాయి నాయకులకు తెలిసే జరుగుతోందని అంటున్నారు. ఇదిలా ఉండగా ప్రస్తుతమున్న రెవెన్యూ అధికారులంతా పొరుగు జిల్లాలకు చెందిన వారు కావడం, వారందరికీ ఎన్నికల విధులే ప్రధాన ప్రాధాన్యతాంశంగా ఉండడంతో ఆక్రమణదారులు తమకేమీ జరగదన్న ధీమాలో ఉన్నట్టు తెలిసింది.

భోగాపురంలో వాగులు.. చెరువులు హాంఫట్




వాగును ఆక్రమించి చదును చేసిన దృశ్యం

భోగాపురం, ఏప్రిల్ 11: భోగాపురంలో భూముల ధరలు ఊహాతీతంగా పెరుగుతుండడంతో ప్రభుత్వ భూములపై కబ్జాదారుల కన్ను పడింది. మండలంలో ఖాళీ స్థలం ఎక్కడ కనిపించినా, అవి వాగు, చెరువు, చెరువు గట్టు అయినా సరే ఆక్రమణకు ఒడిగడుతున్నారు. జిరాయితీ భూములకు పక్కనున్న ప్రభుత్వ భూములను కలిపేసుకుంటున్నారు. ఒకరిని చూసి మరొకరు ఆక్రమించుకొన్నవారికి ఆక్రమించుకున్నంత అన్నట్టు వ్యవహరిస్తున్నారు. ఫిర్యాదులు వచ్చినప్పుడు అధికారులు అక్కడికెళ్లి తూతూమంత్రంగా పరిశీలించి వచ్చేస్తున్నారేగాని ఆక్రమణదారులపై ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదు. దీంతో కొద్దిరోజుల తరువాత మళ్లీ ఆక్రమణలకు ప్రయత్నిస్తున్నారు.

- భోగాపురం మండలంలోని దల్లిపేట వద్దనున్న ఆర్అండ్‌బీ రహదారిని ఆనుకొని చెరువుంది. దీనిని మట్టితో పూడ్చేసి ఆక్రమణకు తెరలేపారు. చదునుకూడా చేస్తున్నారు.
- రాళ్లపాలెం నుంచి దల్లిపేట మీదుగా ముంజేరు వరకు సర్వే నెంబరు 218లో సుమారు 1.78 ఎకరాల గెడ్డ వాగు ఉంది. ఈవాగును గతంలో కొంత వరకు పూడ్చేసి ఆక్రమించారు. తాజాగా మిగతా స్థలాన్ని పూర్తిగా మట్టితో పూడ్చేసి చదును చేసేశారు.
- భోగాపురం జాతీయ రహదారి పక్కనున్న గంగిరావి గట్టు చెరువును ఆక్రమించి శాశ్వత నిర్మాణాలు చేసుకొంటున్నారు. ఆక్రమణదారులు బహిరంగంగానే కబ్జా చేస్తున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. దీనిపై ఉప తహసీల్దార్ శ్రీనివాసరావును వివరణ కోరగా ఆక్రమణలు గుర్తించి ప్రభుత్వ స్థలంలో బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకొంటామని చెప్పారు.

రెండు రోజుల పర్యటనకు చంద్రబాబు

- 15న రాజాం, 16న విజయనగరంలో సభలు



విజయనగరం రూరల్, ఏప్రిల్ 11: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు తొలి విడత ఎన్నికల ప్రచారంలో భాగంగా రెండురోజుల పర్యటనకు జిల్లాకు వస్తున్నారు. ఈ నెల 16న విజయనగరం వస్తున్నట్టు విజయనగరం టీడీపీ కార్యాలయానికి గురువారం రాత్రి సమాచారం అందింది. 15న రాజాంలో సభ ముగించుకుని, అదే రోజు రాత్రి విజయనగరం వచ్చేస్తారు. ఇక్కడే బస చేయనున్నారు. 16న ఉదయం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై, సాయంత్రం 5 గంటలకు రోడ్ షోతోపాటు, బహిరంగ సభ జరిగే అవకాశం ఉంది. పూర్తి షెడ్యూల్‌పై మరోసారి పార్టీ రాష్ట్ర కార్యాలయం స్పష్టత ఇవ్వనుంది.



విజయనగరం ఈద్గా మసీదులో ముస్లింల ప్రార్థనలు

సందడిగా రంజాన్

- ఈద్ ముబారక్ చెప్పుకున్న ముస్లింలు



విజయనగరం(ఆంధ్రజ్యోతి), ఏప్రిల్ 11 : మత సామరస్యానికి ప్రతీకగా చెప్పుకునే రంజాన్ పండగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ఒకరికొకరు ఈద్‌ముబారక్ చెప్పుకున్నారు. నెల రోజుల పాటు కఠోర ఉపవాసం పాటించి ప్రత్యేక ప్రార్థనలతో బుధవారం ఉపవాస దీక్షలను విరమించిన విషయం తెలిసిందే. గురువారం రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని రోజంతా ఆనందోత్సాహాలతో కనిపించారు. నగరంలోని జామియా మసీద్, హజరత్ ఖాదర్‌బాబా దర్గా, మక్కామసీద్‌లో మత గురువులు ప్రార్థనలు నిర్వహించారు. ఆర్టీసీ కాంప్లెక్స్ వద్దనున్న ఈద్గాలో భారీ సంఖ్యలో ముస్లింలు ప్రార్థనలు చేశారు.



వక్రీకరించడం సరికాదు

- డీఆర్‌వోకు ఏపీటీఎఫ్ వినతి

కలెక్టరేట్, ఏప్రిల్ 11: ఆంధ్రప్రదేశ్ టీచర్ ఫెడరేషన్ కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేసుకుంటే దీనికి రాజకీయ రంగు రుద్దడం సరికాదని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు డి.ఈశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. డీఆర్‌వో అనితను గురువారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 10న గంట్యాడ మండల కౌన్సిల్ సమావేశం నరవ ప్రాథమిక పాఠశాలలో జరిగిందని, ఆ రోజు నూతనంగా కార్యవర్గం ఎన్నికైందని, అయితే దీనిపై ఓ పత్రికలో (ఆంధ్రజ్యోతి కాదు) రాజకీయ రంగు రుద్దారని, ఇది సరైనది కాదని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. డీఆర్‌వోను కలిసిన వారిలో సంఘ నాయకులు సదాశివరావు, ఆర్.కృష్ణరావు, ఎన్‌వీ పైడిరాజు, కేవీ రమణ, వెంకటరమణ తదితరులు ఉన్నారు.

విస్తృతంగా తనిఖీలు చేయండి

- నగదు రూ.50వేల కంటే ఎక్కువ ఉంటే సీజ్
- నగదు, వస్తువులకు రసీదు ఇవ్వాలి : జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి

కలెక్టరేట్, ఏప్రిల్ 11: క్షేత్రస్థాయిలో తనిఖీలు ముమ్మరంగా చేయాలని, రూ.50 వేలు కంటే ఎక్కువగా నగదు లభిస్తే వెంటనే సీజ్ చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి ఆదేశించారు. ఆ నగదు ఎన్నికలకు సంబంధించినదైతే కేసు కూడా నమోదు చేయాలన్నారు. ఎన్నికలతో సంబంధం లేకపోతే జిల్లా గ్రీవెన్స్ కమిటీకి నివేదించాలని సూచించారు. ఆర్‌వోలు, ఏఆర్‌వోఎలు, ఫ్లయింగ్ స్క్వాడ్స్ సభ్యులతో కలెక్టరేట్ నుంచి గురువారం ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్వాధీనం చేసుకున్న నగదు లేదా వస్తువుల వివరాలను నమోదు చేసి వాటి యజమానికి తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని తెలిపారు. సీజ్ చేసిన నగదు లేదా వస్తువుల వివరాలను ఈఎస్ఎంఎస్ పోర్టల్ అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ఫ్లయింగ్ స్క్వాడ్స్ విస్తృతంగా పర్యటించాలన్నారు. నగదు, వస్తువులను సీజ్ చేసినప్పుడు పాటించాల్సిన నియమనిబంధనలను వివరించారు. రూ.10 వేలకు మించి విలువైన బహుమతులను తగిన పత్రాలు లేకుండా తరలిస్తే సీజ్ చేయవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో జేసీ కార్తీక్, డీఆర్‌వో అనిత, జడ్పీ సీఈవో శ్రీధర్ రాజా, డీఆర్‌డీఏ పీడీ కళ్యాణ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

కంట్రోల్ రూం పరిశీలన

కలెక్టరేట్‌లోని ఎన్నికల కంట్రోల్ రూంను కలెక్టర్ నాగలక్ష్మి గురువారం పరిశీలించారు. వివిధ విభాగాల కార్యకలపాలను తనిఖీ చేశారు. నమోదు చేసిన కేసులు, తీసుకున్న చర్యలపై కలెక్టర్‌కు సీపీవో బాలాజీ, నోడల్ అధికారి సత్య ప్రసాద్ వివరించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

నో స్టాక్

- నాయకుల స్టాక్ పాయింట్‌కు ఇప్పటికే తరలిన చీప్ లిక్కర్
- ఇబ్బంది పడుతున్న పేద మందుబాబులు



విజయనగరం(ఆంధ్రజ్యోతి), ఏప్రిల్ 11: ఎప్పుడూ లేనివిధంగా జిల్లాలో చీప్ లిక్కర్‌కు రెక్కలు వచ్చాయ్. ఎక్కడ చూసిన స్టాక్ లేదంటూ షాపులోని సేల్స్‌మన్‌లు చెబుతున్నారు. ఉన్న కొద్ది బాటిళ్లు అయిన తరువాత మందుబాబులు గొడవలకు దిగుతున్నారు. సమాధానం చెప్పలేక ప్రభుత్వ మద్యం షాపుల సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు. కొన్ని చోట్ల కొంత సమయం షాపు మూసుకునే పరిస్థితి నెలకొంది. కాగా మద్యం షాపుల్లో ఖరీదైన మద్యం మాత్రమే కనిపిస్తోంది. కూలీలు, మధ్యతరగతి వారు సేవించే మద్యం దొరకడం లేదు. ఆ సరుకంతా ఇప్పటికే నాయకులు ఏర్పాటుచేసుకున్న స్టాక్ పాయింట్‌కు తరలినట్లు సమాచారం. ఎన్నికల ప్రచారంలో వినియోగించుకునేందుకు ముందుచూపుతో వేలాదిగా బాటిళ్ల భద్రపరిచినట్లు తెలుస్తోంది. బీర్‌లదీ ఇదే పరిస్థితి. జిల్లాలో 149 ప్రభుత్వ మద్యం షాపులు, 28 బార్‌లు ఉన్నాయి. మద్యం షాపుల్లో రూ.120, రూ.130, రూ.150 ధరల చీప్ లిక్కర్ కనిపించటం లేదు. షాపుల సిబ్బందితో నాయకులు కలిసిపోయి చీఫ్‌లిక్కర్‌ను ప్రత్యేక స్థలాలకు తరలిస్తున్నారనే ప్రచారం జిల్లాలో జోరుగా సాగుతోంది. అసలే వేసవి కాలం ఎండలు మండిపోతున్నాయి. అందులోను పెళ్లిళ్లు, పండగలు ముమ్మరంగా ఉన్నాయి. ఈ సమయంలో చీప్ లిక్కర్ దొరక్క మందుబాబులు అవస్థలు పడుతున్నారు. చల్లని బీర్ తాగాలన్నా దొరకడం లేదంటున్నారు.

నిబంధనల మేరకే విక్రయాలు

ఎంత స్టాకు ఉంటే అంత స్టాకు మేరకే ప్రభుత్వ మద్యం దుకాణాల్లో విక్రయాలు సాగుతాయి. నిబంధనలకు విరుద్ధంగా సిబ్బంది మద్యాన్ని విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

\- రమణ, ఏపీ బెవరేజస్ డిపో మేనేజర్, నెల్లిమర్ల



శంకరరావు(ఫైల్)

కానిస్టేబుల్ ఆత్మహత్య

- గన్‌తో తనకు తాను కాల్చుకున్న వైనం
- విశాఖలో ఘటన
- సొంతూరు కొట్టిశలో విషాదం

వంగర, ఏప్రిల్ 11: విశాఖపట్నంలో ఓ బ్యాంక్‌లో ఎస్‌పీఎఫ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వంగర మండలం కొట్టిశ గ్రామానికి చెందిన పాలవలస శంకరరావు (38) గురువారం తెల్లవారుజామున తుపాకీతో తనను తాను కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విధులకు హాజరైన కొద్ది వ్యవధిలోనే ఈ ఘటన జరిగింది. అందరితో సరదాగా కలిసిపోయే వ్యక్తి అకస్మాత్తుగా మృతిచెందినట్లు తెలుసుకున్న గ్రామస్థులు దుఃఖ సాగరంలో మునిగారు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పాలవలస శంకరరావు (35) భార్య శ్రావణి, కుమారుడు కిశోర్, కుమార్తె జ్ఞానవితతో కలిసి మద్దిలపాలెం ప్రాంతంలోని పీతలవానిపాలెంలో నివాసం ఉంటున్నారు. రోజూ మాదిరిగానే గురువారం ఉదయం ఐదు గంటలకు ద్వారకానగర్‌లోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు చెస్ట్‌లో సెంట్రీ డ్యూటీలో చేరారు. ఉదయం ఏడు గంటల సమయంలో తన చేతిలో ఉన్న ఎస్ఎల్ఆర్ వెపన్‌తో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. సొంతూరు వచ్చినప్పుడల్లా అందరితో సరదాగా ఉండేవాడని, పేద విద్యార్థులకు సాయం చేస్తుంటాడని కొట్టిశ గ్రామస్థులు చెబుతున్నారు. ఘటన గురించి తెలిసిన వెంటనే తండ్రి దామోదర్, ఇతర కుటుంబ సభ్యులు విశాఖకు బయలుదేరి వెళ్లారు.

అడుగడుగూ గోతులమయం

● అధ్వానంగా గజపతినగరం రోడ్లు ● ప్రమాదకరంగా ఆండ్ర రహదారి ● ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



అధిక బరువుతో వెళ్తూ గుంతలో కూరుకుపోయిన లారీ

విజయనగరం (ఆంధ్రజ్యోతి): గజపతినగరం నియోజకవర్గంలో రోడ్ల పరిస్థితి దయనీయంగా తయారైంది. గజపతినగరం నుంచి ఆండ్ర వెళ్లే మార్గమంతా గోతులమయంగా మారి సంవత్సరాలు గడుస్తున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. గజతినగరం నుంచి లోగిశ, కెంగువ, పాత బగ్గాం, ముచ్చెర్ల, వెంకటాపురం తదితర గ్రామాల మార్గాలు గోతులమయంగా మారినా ఎటువంటి చర్యలు లేవు. మంత్రి బొత్స సత్యనారాయణ సోదరుడు బొత్స అప్పలనరసయ్య ప్రాతినిధ్యం వహిస్తున్న చోటే పరిస్థితి ఇలా ఉందని స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు.

ఆండ్ర వెళ్లే మార్గంలో మెంటాడ వద్ద చేపడుతున్న గ్రీన్ ఫీల్డ్ హైవే పనులకు సంబంధించి, రా మెటీరియల్ ఇదే రోడ్డు ద్వారా నిత్యం తరలిస్తుంటారు. ఒక్కోలారీలో పరిమితికి మించి, అక్రమంగా 40-50 టన్నుల లోడ్‌తో మెటీరియల్‌ను లారీలో తరలిస్తున్నారు. రోజూ సుమారు 50 నుంచి 70 లారీలు ఈ చిన్నపాటి రోడ్డు మార్గం గుండా ప్రయాణిస్తాయి. ఈ రోడ్డు సామర్థ్యానికి మించి రా మెటీరియల్ రవాణా చెయ్యటం వల్ల రోడ్డులో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో లారీలు గుంతల్లో ఇరుక్కుపోయి ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంది. రాత్రిళ్లు ఈ మార్గం గుండా ప్రయాణించే వారు. ప్రమాదాలకు గురై, గాయాలపాలవుతున్నారు. సామర్థ్యానికి మించి లారీల్లో కంకర, గ్రావెల్, ఇసుక, తదితర మెటీరియల్ తరలిస్తున్నా.. స్థానిక ఎమ్మెల్యే అప్పలనర్సయ్య కానీ, ఆర్టీఏ, రెవెన్యూ అధికారులు కానీ కనీసం పట్టించుకోకపోవటంతో ఆందోళన వ్యక్తమవుతుంది. దీనిపై ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీళ్లంతా కమిషన్ల కోసం కోసం కళ్లుమూసుకుంటున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.



గుంతలమయంగా గజపతినగరం-ఆండ్ర రోడ్డు

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

పాచిపెంట, ఏప్రిల్ 11: అనుమానాస్పద స్థితిలో పాచిపెంట గ్రామానికి చెందిన డోల శంకరరావు(36) గురువారం ఉదయం మృతి చెందాడు. స్థానిక ఎస్ఐ నారాయణరావు వివరాల ప్రకారం శంకరరావు మృతదేహం మండలంలోని పి.కోనవలస సమీపంలో గల పెద్దగెడ్డకు ఆనుకుని ఉన్న కర్రివలస, వేగావతి ఆన కట్ట ఎడమ కాలువ పక్కన కనిపించింది. ఆ సమీపంలో గల చీపు రువలస గ్రామస్థులు చూసి పోలీసులకు సమాచారం అందించా రు. వెంటనే ఎస్ఐ నారాయణరావు హుటాహుటిన సంఘటన స్థలానికి వెళ్లారు. మృతదేహానికి శవ పంచనామ నిర్వహించి పోస్టుమార్టం నిమి త్తం సాలూరు ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్ఐ నారాయణరావు దర్యాప్తు నిర్వహిస్తున్నారు.



శంకరరావు (ఫైల్)

బైక్‌లు ఢీ.. ఇద్దరికి గాయాలు

రేగిడి: ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొనడంతో ఇద్దరు గాయపడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు తెలి పిన వివరాలు ఇలా ఉన్నాయి. రేగిడి మండలం అక్కన్నఅగ్రహారం గ్రామానికి చెందిన కామోజీ గురుమూర్తి బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. గురువారం మోటార్‌బైక్‌పై ఉంగరాడమెట్ట జంక్షన్‌కు వస్తుండగా ఎదురుగా మరో బైక్‌పై వస్తు న్న గరివిడి మండలం గెడ్డాపువలసకు చెందిన తాడ్డి జగదీష్ బలంగా ఢీకొన్నారు. ఈ ఘటనలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108 సిబ్బంది ఈశ్వరరావు, పవన్‌కుమార్ ప్రాథమిక చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యంకోసం రాజాం తర లించినట్లు వెల్లడించారు. ఈ ఘటనపై పోలీసులకు సమాచారం అందాల్సి ఉంది.

చికిత్స పొందుతూ మహిళ మృతి

సీతానగరం, ఏప్రిల్ 11: సీతానగరం మండలంలోని కొత్తవలస గ్రామానికి చెందిన ముచ్చి మంగమ్మ (గంగ 23) పార్వతీపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. ఎస్ఐ రాజేష్ అందించిన వివరాల ప్రకా రం గత నెల 20న కొత్తవలసలోని తన కన్న వారింట్లో స్నానం నిమిత్తం కట్టెలతో వేడినీరు మరగబెడుతుండగా ప్రమాదవశాత్తు చీరకొంగుకు నిప్పు అంటుకోగా శరీరం కాలిపోయింది. ఆమెను పార్వతీపురం జిల్లా ఆసుపత్రిలో ఈ నెల 1న చికిత్స నిమిత్తం చేర్చారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందా రు. మృతురాలు మంగమ్మకు గత ఏడాది మండలంలోని సూరమ్మపేట గ్రామానికి చెందిన బొబ్బిలి గౌరిశంకర్‌తో వివాహమైంది. గౌరి శంకరరావు సూరమ్మపేట వాలంటీర్‌గా పనిచేస్తున్నాడు. వీరికి ఒక బాబు ఉన్నాడు. గత నెలలోని ఆసు పత్రిలో జన్మించగా ఆమె బాబుతో కలిసి కన్నవారింటికి వెళ్ళింది. శవ పంచనామా అనంతరం పార్వతీపురం జిల్లా ఆసుపత్రిలో పోస్టుమార్టం చేసి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు.

గుర్తు తెలియని రైలు ఢీ కొని మహిళ మృతి

సీతానగరం: గుర్తు తెలియని రైలు ఢీ కొని కొంచాడ ఈశ్వరమ్మ(60) మృతి చెందిన ఘటన మండలంలో మర్రిపివలస గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు అందించిన వివరాల ప్రకారం లచ్చయ్యపేట గ్రామానికి చెందిన కొంచాడ ఈశ్వరమ్మ గత కొన్ని రోజులుగా మతి స్థిమితం లేకుండా ఉంది. ఆమె బుధవారం ఊరి నుంచి వెళ్లిపోయింది. గురువారం మర్రిపివలస సమీపంలో ట్రాక్ దాటుతుండగా ఈ ప్రమాదం జరిగి అక్కడిక్కడే మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెడ్ కానిస్టేబుల్ రత్నకుమార్ తెలిపారు.

లెక్కలు చూపని రూ.1.52 లక్షలు సీజ్

బొబ్బిలి: పట్టణ పరిధిలోని పాతబొబ్బిలి జంక్షన్‌లోని చెక్‌పోస్టు దగ్గర లెక్కలు చూపని 1.52 లక్షల రూపాయల నగదును ఇద్దరి దగ్గర నుంచి స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు ఎస్ఐ లోవరాజు తెలిపారు. ఎన్నికల నిబంధనల ప్రకారం 50 వేల రూపాయలకు మించి నగదుతో ప్రయాణించరాదన్నారు. సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేస్తుండగా గురువారం ఇద్దరు వ్యాపారుల నుంచి ఈ మొత్తాన్ని గుర్తించామన్నారు. మధ్యవర్తుల సమక్షంలో నగదును సీజ్ చేసి తదుపరి చర్యల కోసం జెడ్పీ సీఈవోకు నివేదించినట్లు ఆయన తెలిపారు.

ఆటో బోల్తా.. వ్యక్తి మృతి

పార్వతీపురం టౌన్/ పార్వతీపురం రూరల్: ఆటో బోల్తా పడిన ఘటనలో వ్యక్తి మృతిచెందాడు. గురువారం సాయంత్రం పార్వతీపురం మండలంలోని హెచ్.కా రాడవలస గ్రామ సమీపంలో తాళ్లబురిడి గ్రామం నుంచి నిడగల్లు గ్రామానికి వెళ్తున్న ఆటో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి బోల్తాపడింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న పైలా సింహాచలం(68), సుబ్బలక్ష్మి, అనూషాలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో జిల్లా ఆసుపత్రికి తీసుకువస్తున్న సమయంలో పైలా సింహచలం మృతి చెందినట్లు రూరల్ పోలీసులు, బంధువులు తెలిపారు.

సారా స్థావరాలపై పోలీసుల దాడి

కొమరాడ: సరిహద్దు ప్రాంతంలో ఆంధ్ర, ఒడిశా పోలీసులు చేపట్టిన దాడుల్లో భారీస్థాయిలో పులిసిన ఊట బెల్లం, సారా డ్రమ్ములను స్వాధీనం చేసుకున్నారు. గురువారం పెల్లిగుడ్డి, బొత్తడపల్లి సమీపంలో చేసిన దాడుల్లో 70 డ్రమ్ములు, 300 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నీలకంఠం తెలిపారు. 9 వేల లీటర్ల పులిసిన బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో పార్వతీపురం రూరల్ ఎస్ఐ దినకర్, ఎక్సైజ్ అధికారులు, ఒడిశా పోలీసులు పాల్గొన్నారు.

మద్యం సీసాల స్వాధీనం

దత్తిరాజేరు: మండలంలోని షికారుగంజిరోడ్డు జంక్షన్ వద్ద అక్రమంగా తరలిస్తున్న 17 మద్యం సీసాలను ఒక మహిళ నుంచి స్వాధీనం చేసుకున్నట్లు స్టేషన్ బూర్జవలస ఎస్ఐ లక్ష్మీప్రసన్నకుమార్ గురువారం తెలిపారు. నిందితుడిని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు.

ఖైనీ, గుట్కా స్వాధీనం

గరివిడి: గరివిడి రైల్వే బ్రిడ్జి కింద ఖైనీ గుట్కాలను విక్రయిస్తున్న ఇద్దరు వ్యాపారస్థులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం అర్ధరాత్రి పట్టుకున్నారు. పట్టుకున్న ఖైనీ, గుట్కా ప్యాకెట్లను గరివిడి పోలీసులకు అప్పగించారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్న ఖైనీ, గుట్కా ప్యాకెట్ల విలువ సుమారు రూ.2.50లక్షలు ఉంటుందని గరివిడి పోలీసులు అంచనా వేస్తున్నారు. ఉన్నత అధికారులకు నివేదిక అందజేస్తామని గరివిడి ఎస్ఐ దామోదరరావు తెలిపారు.



టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్న ఖైనీ, గుట్కా ప్యాకెట్లు

అంధకారంలో చీపురుపల్లి రోడ్

రాజాం రూరల్: రాజాం-చీపురుపల్లి రోడ్‌లో బావిరేతమ్మ మందిరం నుంచి గాయత్రికాలనీ వరకూ సుమారు కిలోమీటర్ మేర అంధకారం రాజ్యమేలుతోంది. రహదారి గోతులమయంగా మారడం, ఆపై అంధకారంతో పరిస్థితి భ యానకంగా మారింది. ఇదిలా ఉంటే చీకటిపడితే చాలు ఇదేరోడ్‌లో మందు బాబులు హల్‌చల్ చేస్తుండడంతో ఆమార్గంలో రాకపోకలు సాగించేవారంతా అవస్థలకు గురవుతున్నారు. రాజాం నుంచి ఈమార్గంలో సైకిళ్లపై గాయత్రికాలనీ, పెనుబాక, కొత్తవలస, మారేడుబాక, బొద్దాం, కొఠారిపురం తదతర గ్రామాలకు వెళ్తున్న విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

విజయనగరం రింగురోడ్డు: ప్రయాణికుల కోసం శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు విజయనగరం ఆర్టీసీ డిపో మేనేజర్ జె. శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకూ డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. డిపో పరిధిలో గల ప్రయాణికులు తమకు ఎటువంటి సమస్యలు ఉన్నా.. ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చునని పేర్కొన్నారు. 99592 25620 నెంబరుకు ఫోన్ చేయాలని కోరారు.

రేరా చట్టంపై అవగాహన

విజయనగరం రింగురోడ్డు: రేరా చట్టం-2016పై అవగాహన సమావేశాన్ని ఈ నెల 13న ఉదయం 10 గంటలకు విజయనగరం తహశీల్దారు కార్యాలయ ఆవరణలో గల జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రంలో ఏర్పాటు చేస్తున్నట్టు డీసీఐసీ ఇన్‌ఛార్జి చదలవాడ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థిరాస్తి నియంత్రణ ప్రాధికారిక సంస్థ నిబంధనలు, కొనుగోలుదారులకు సూచనలు, ప్రమోటర్స్ సొసైటీ రిజిస్టర్ పురోగతి తదితర విషయాలపై చర్చించనున్నట్టు పేర్కొన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

విజయనగరం రింగురోడ్డు: ఆల్ఫా కంప్యూటర్ ఎడ్యుకేషన్ ట్రస్టు ద్వారా పేద, మధ్య తరగతి, నిరుద్యోగ యువతీ యువకులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నట్టు నిర్వాహకుడు తరుణ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డీసీఏ, పీడీడీసీఏ, డీటీపీ, టాలీ, సీ, సీ ప్లస్, ప్లస్, జావా, ఎంఎస్ ఆఫీస్ తదితర కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. ఎంఆర్ కళాశాల ఎదురుగా ఉన్న ఆల్ఫా సెంటర్‌లో ఈ తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు 93464 36642, 89198 46665 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

వివరాలు పక్కాగా నమోదు చేయాలి

సీతానగరం: ఆరోగ్య కార్యక్రమాల వివరాలు పక్కాగా నమోదు చేయాలని డీఎంవో టిజగన్మోహన రావు ఆదేశించారు. ఎఫ్‌డీపీ నోడల్ అధికారి ఎం.వినోద్‌కుమార్‌తో కలిసి బలిజిపేట మండలంలోని బర్లి, మిర్తివలస గ్రామాల్లోని హెల్త్ వెల్నెస్ కేంద్రాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ప్రగతి నివేదికలు, రికార్డులను పరిశీలించారు. గర్భిణుల రిజిస్ట్రేషన్ మొదటి త్రైమాసికంలోనే త్వరగా జరగాలని ఆదేశించారు. సిబ్బంది సమన్వయంతో ప్రిజం10 (పీఆర్ఐఎస్ఎం 10) పక్కాగా అమలు చేస్తూ శిశు ఆరోగ్య శ్రేయస్సుకు కృషి చేయాలన్నారు. వేసవి దృష్ట్యా గర్భిణులు, బాలింతలు, చిన్నారులు దీర్ఘకాలిక రోగుల ఆరోగ్యంపై దృష్టి సారించాలని, అవసరమైన మందులు, నిర్ధారణ పరీక్షలు గ్రామాల్లో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎపిడిమియాలజిస్ట్ శ్రీధర్, వైద్యాధికారి శివగాయిత్రి, సూపర్‌వైజర్లు నారాయణరావు, సత్యవతి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఉర్లాపు

రాజాం: రాజాం నియోజకవర్గానికి చెందిన ఉర్లాపు రాజు జనసేన పార్టీ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియామకమయ్యారు. ఈ మేరకు గురువారం పార్టీ నియామకపత్రం అందించింది. రాజకీయ నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు శుభాకాంక్షలు తెలి పారు. ● **పాలకొండ:** జనసేన ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ఉపాధ్యక్షుడిగా గర్భాన సత్తిబాబు నియమితులయ్యారు. ఈ సందర్భంగా సత్తిబాబును జనసేన నాయకులు, కార్యకర్తలు అభినందించారు.

వివాదాలు సృష్టిస్తే కఠినచర్యలు : డీఎస్పీ

రాజాం రూరల్, ఏప్రిల్ 11: ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో వివాదాలు సృష్టించిన వారిపై చట్టప్రకారం కఠినచర్యలు తప్పవని చీపురుపల్లి డి.ఎస్పీ శ్రీనివాస చక్రవర్తి స్పష్టం చేశారు. మండల పరిధిలోని గురవాం, గడ్డిముడిదాం గ్రామాల్లో గురువారం రాత్రి అవగాహన సదస్సులు నిర్వహించారు. ఆయా గ్రామాల పెద్దలతో చర్చించారు. క్షణకావేశంలో వివాదాలు సృష్టించినా, అల్లర్లను ప్రోత్సహించినా, శాంతిభద్రతలకు భంగం కలిగించేలా కవ్వింపు చర్యలకు పాల్పడినా కేసులు నమోదు చేస్తామని డిఎస్పీ హెచ్చరించారు. రాజాం టౌన్ సి.ఐ. దాడి మోహనరావు పాల్గొన్నారు.

స్పిల్‌వే గేట్లకు మరమ్మతులు



ప్రాజెక్టు పరిధిలోని స్పిల్‌వే గేట్లకు మరమ్మతులు చేపడుతున్న దృశ్యం

గరుగుబిల్లి: తోటపల్లి ప్రాజెక్టు పరి ధిలోని స్పిల్‌వే గేట్లకు మరమ్మతులు చేస్తు న్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి పైనుంచి నీటి సామర్థ్యం తక్కువగా రావడంతో అధికారులు గేట్లకు గ్రీస్, చైన్ల శుభ్రతతో పాటు వివిధ పనులు చేపడుతు న్నట్టు డీఈ టి.రఘు నాథనాయుడు, జేఈ కిషోర్‌కుమార్ తెలిపారు.

బోది చెట్టు పునరుద్ధరణ



బోధి చెట్టు నమునా పునరుద్ధరణ కార్యక్రమంలో నగరపాలక సంస్థ సిబ్బంది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

విజయనగరం రింగురోడ్డు: విజయనగరం పెద్ద చెరువు రోడ్డులో ఉన్న బుద్ధ విగ్రహాన్ని ఆనుకుని బోది చెట్టు నమునా చెట్టు ఉండేది. అది ఇటీవల కూలిపోయింది. ఈ విషయమై ఈ నెల 10న 'ఆంధ్రజ్యోతి'లో 'నిర్లక్ష్యంతోనే శిథి లం' పేరిట కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి నగర పాలక సంస్థ అధికారు లు స్పందించారు. ఆగమేఘాల మీద బోధి చెట్టు నమునాను పునరుద్ధరించారు.

గిరిశిఖర అంతర్రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్ విజేత ఒడిశా



విజేత జట్టుకు కప్ ప్రదానం చేస్తున్న దృశ్యం

సాలూరు రూరల్: గిరిశిఖర అంతర్రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్‌లో ఒడిశాకు చెందిన బారి జట్టు విజేతగా నిలిచింది. సాలూరు మండలం గిరిశిఖర గ్రామం చోరలో అంతర్రాష్ట్ర గిరిశిఖర గ్రామాల క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో ఏపీకి, ఒడిశా గిరిశిఖరాలకు చెందిన 16 జట్లు పాల్గొన్నాయి. గురువారం జరిగిన ఫైనల్‌లో చోర జట్టుపై ఒడిశాకు చెందిన బారి జట్టు విజయం సాధించింది. విజేత జట్లుకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో సాలూరు ఏఎంసీ ఛైర్మన్ ప్రతినిధి దండి శ్రీనివాసరావు, తోణాం సర్పంచ్ మువ్వల ఆదయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిది కిలోల వెండి ఆభరణాలు పట్టివేత

రాజాం రూరల్, ఏప్రిల్ 11: మండల పరిధిలోని గార్రాజు చీపురుపల్లి జంక్షన్ వద్ద ఫ్లైయింగ్ స్క్వాడ్ నిర్వహిస్తున్న తనిఖీల్లో సుమారు ఐదు లక్షలు విలువచేసే ఎనిమిది కిలోల వెండి ఆభరణాలను గురువారం రాత్రి స్వాధీనం చేసుకు న్నారు. విజయనగరం నుంచి రాజాంలోని పలు బంగారు, వెండి షాపులకు వెండి ఆభరణాలు అమ్మకానికి తెస్తున్నట్లు ఆభరణాలతో పట్టుబడ్డ వ్యక్తి పోలీసులకు స్పష్టం చేశారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి బాలరాజు, ఏఎస్ఐ వాసుదేవరావు ఆధ్వర్యంలో వీటిని పట్టుకున్నారు. కాగా మండల పరిధిలోని పొగిరి గ్రామ సమీపంలో శ్రీకాకుళం నుంచి రాజాం వస్తున్న ఓ వ్యక్తి నుంచి బుధవారం రాత్రి రూ.1,31,000 మొత్తాన్ని పోలీసులు పట్టుకున్నారు. నగదును రాజాం తహసీల్దార్ కార్యాలయానికి తరలించి విచారణ చేపట్టారు. నగదుకు సంబంధించిన ఆధారాలను అధికారులకు చూపించడంతో నగదును అందజేశారు.



పట్టుబడ్డ వెండి ఆభరణాలు

చంద్రబాబు రోడ్‌షోకు తరలిరావాలి

● మాజీ మంత్రి, రాజాం కూటమి అభ్యర్థి కోండ్రు



మాట్లాడుతున్న కోండ్రు మురళీమోహన్

రేగిడి: టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈనెల 15న రాజాం పట్టణంలో రోడ్‌షో నిర్వహించనున్నారని ఎమ్మెల్యే అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ తెలిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు తరలి వచ్చేలా చూడాలని కోరారు. ఉంగరాడమెట్ట టీడీపీ కార్యాలయంలో గురువారం మూడు పార్టీల నేతలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలని, అందుకు అందరూ సహకరించాలని కోరారు. ఈ సమావే శంలో రాజాం టీడీపీ నేత కోండ్రు జగదీష్, మండల టీడీపీ నేతలు దూబ ధర్మా రావు, కిమిడి అశోక్‌కుమార్, మజ్జి శ్రీనివాసరావు, గేదల బాలమురళీధర్, చల్ల భుజంగరావు, పాలవలస రామచంద్రినాయుడు, గురువాన రమేష్, కె.మహేష్, గురవాన ధనంజయరావు తదితరులు పాల్గొన్నారు. **రాజాం:** నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్‌ను గెలిపించాలని కోరుతూ మత్స్యకా రులు తమ సంఘ అధ్యక్షుడు బెహరా తవుడు ఆధ్వర్యంలో గురువారం పరశు రాంపేట, దోసరిరామినాయుడువలస, కంచరాం గ్రామాల్లో ప్రచారం చేశారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే మత్స్యకారుల సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. కోడూరు తవిటన్నదొర, దుచ్చిన శ్రీను, తియ్యాల అప్పలరాము, బొండపల్లి అప్పన్నదొర, తదితరులు పాల్గొన్నారు. ● రాష్ట్ర భవిష్యత్ కోసం దార్శ నికుడు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాలన వస్తేనే రాష్ట్ర భవిష్యత్ ఉంటుందని కోండ్రు మురళీమోహన్ అన్నారు. గురువారం శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో బొమ్మినాయుడువలస పంచాయతీ గొల్లపేటకు చెందిన 20 వైసీపీ కుటంబాలు, సంతకవిటి మండలం పల్లిటి గ్రామానికి చెందిన 40 ఎస్సీ కుటుంబాలు టీడీపీలో గురువారం టీడీపీలో చేరారు. వీరికి పార్టీ కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వా నించారు. అనంతరం శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులు. కార్యకర్తలు, అభిమానులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

అన్ని హామీలు అమలు చేశాం: బొత్స

విజయనగరం దాసన్నపేట: ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులకు ఒక్క సీపీఎస్ (కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకం) తప్ప, మిగతా అన్నీ ఇచ్చామని రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. రీజనల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డితో పాటు వైసీపీ ముఖ్య నాయకులతో ఉమ్మడి విజయనగరం జిల్లా విస్తృతస్థాయి సమావేశం గురువారం నెల్లిమర్ల రోడ్డులోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ పార్టీలో ఉంటూ... కుట్రలు, కుతంత్రాలు చేసే నాయకులను పట్టించుకోకుండా వదిలేయాలన్నారు. సమావేశంలో వైసీపీ రీజనల్ కో-ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, అరకు ఎంపీ అభ్యర్థి తనూజ, ఎమ్మెల్యేలు అప్పలనాయుడు, కడుబండి శ్రీనివాసరావు, బొత్స అప్పలనర్సయ్య, పాముల పుష్పశ్రీవాణి, అలజంగి జోగారావు, తలే రాజేష్, జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, పరీక్షిత్ రాజుతో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● వైసీపీ ఉమ్మడి జిల్లా విస్తృత స్థాయి సమావేశం సందర్భంగా యథేచ్ఛగా రాజకీయ నాయకుల ఫొటోలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. సమావేశానికి వెళ్లే రహదారిలో మరింత విస్తృతంగా ఏర్పాటు చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను పట్టించుకోకుండా ఫ్లెక్సీలను అధికార పార్టీ నాయకులు ఏర్పాటు చేశారు. వీటిని సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.



మాట్లాడుతున్న బొత్స

రాక్షస పాలన అంతానికే కూటమి ఏర్పాటు

● విశాఖ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్

శృంగవరపుకోట రూరల్: రాష్ట్రంలో మరోసారి రాక్షసుడు అధికారంలోకి వస్తే ప్రజల జీవితాలు అస్తవ్యస్తం అవుతాయని... ఈ పాలనకు చరమగీతం పాడేందుకు కూటమి ఏర్పడిందని విశాఖ కూటమి ఎంపీ అభ్యర్థి శ్రీభరత్ అన్నారు. గురువారం పోతనాపల్లిలో ఏర్పాటు చేసిన జయహో బీసీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి లలితకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శ్రీభరత్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు ఉజ్వల భవిష్యత్ అందించాలని బీజేపీతో చేయి కలిపినట్టు చెప్పారు. బొడ్డవర, తలారీ పంచాయతీల నుంచి పలువురు మాజీ సర్పంచులు, వార్డు సభ్యులు, ఉప సర్పంచులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ● **లక్కవరపుకోట:** రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని విశాఖ పార్లమెంట్ కూటమి అభ్యర్థి ఎం.శ్రీభరత్ తెలిపారు. గురువారం సాయంత్రం చందులూరు ఎన్నికల శంఖారావం సభలో ఆయన ప్రసంగించారు. ● **శృంగవరపుకోట:** తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి రాష్ట్రంలో అధికారం చేపడుతుందని విశాఖ పార్లమెంటు టీడీపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్, శృంగవరపుకోట ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల లలిత కుమారిలు అన్నారు. గురువారం శృంగవరపుకోట శ్రీనివాసకాలనీలో జనసేన, బీజేపీ నాయకులతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ● **జామి:** జామిలో వైసీపీకి చెందిన వంద కుటుంబాలు కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి లలితకుమారి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వీరికి ఎంపీ అభ్యర్థి శ్రీభరత్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ● **వేపాడ:** మండలంలోని వీలుపర్తి-వెల్దాం గ్రామాల్లో గురువారం నిర్వహించిన జయహో బీసీ కార్యక్రమంలో నియోజకవర్గం ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల లలితకుమారి, శ్రీభరత్ పాల్గొన్నారు. సభకు విచ్చేసిన నాయకులకు, అభ్యర్థులకు గ్రామస్థులు అడుగడుగునా హారతులు పట్టి స్వాగతం పలికారు.



ఎస్‌కోట రూరల్: మాట్లాడుతున్న శ్రీభరత్

బఫర్‌జోన్‌లో నిర్మాణంపై ఫిర్యాదు

బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలో అనేక చెరువు ప్రాంతాలలో విచ్చలవిడిగా లేఅవుట్లు వెలుస్తున్నాయి. తాజాగా స్థానిక భైరిసాగరం చెరువు ప్రాంతంలో వెలసిన లేఅవుట్‌లో బఫర్ జోన్ (లే అవుట్‌కు రక్షణ) గా ఉన్న స్థలంలో అక్రమ నిర్మాణం జరుగుతోంది. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై టౌన్‌ప్లానింగ్ అధికారి వరప్రసాద్ స్పందిస్తూ... బఫర్ జోన్‌లో నిర్మాణ పనులపై ఆన్‌లైన్‌లో ఫిర్యాదు వచ్చిందన్నారు. దీనిపై యజమానికి నోటీసులు జారీ చేశా మని చెప్పారు. ఆయన ఇచ్చిన వివరణ మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.



విజయమే లక్ష్యంగా పనిచేయండి: అదితి


ప్రచారం చేస్తున్న అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్: రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు శ్రమించాలని విజయనగరం నియోజకవర్గ అభ్యర్థి అదితి గజపతిరాజు కోరారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో క్లస్టర్-7, 8 సమావేశాలను ఆమె నిర్వహించారు. విభేదాలను పక్కన పెట్టి విజయ మే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

16వ డివిజన్‌లో ప్రచారం

కూటమి అభ్యర్థి అదితి గజపతిరాజు నగరంలోని 16వ డివిజన్‌లో గురువారం ఇంటింటి ప్రచారం చేశారు. టీడీపీ నాయకులు ఉంగ్రాళ్ల వెంకటఅప్పారావు, రాజేష్‌లతో కలసి కొనిసివీధి, మజపతిరాళ్ల, ఖమ్మవీధి, పార్కుగేటు జంక్షన్, శివాలయం వీధి తదితర ప్రాంతాల్లో ప్రచారం చేశారు. టీడీపీ నాయకులు ప్రసాదుల ప్రసాద్, ఆల్తి బంగారుబాబు, నడిపిల్లి రవికుమార్, అవనాపు విజయ్, అవనాపు భార్గవి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి చరమగీతం పాడాలి: మాధవి


భోగాపురం: పార్టీలో చేరినవారిని ఆహ్వానిస్తున్న నాగమాధవి

పూసపాటిరేగ: కలిసికట్టుగా శ్రమించి నెల్లిమర్ల నియోజకవర్గంలో వైసీపీకి చరమగీతం పాడాలని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి లోకం మాధవి పిలుపునిచ్చారు. మండలంలో తొత్తడాం, గుంపాం, వెంపడాం గ్రామాల్లో ఆమె గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మహంతి చిన్నంనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు మహంతి శంకరరావు, దంతులూరి సూర్యనారాయణరాజు, ఆకిరి ప్రసాదరావు, జనసేన పార్టీ అధ్యక్షుడు శివ తదితరులు పాల్గొన్నారు.

● భోగాపురం: పూసపాటిరేగ మండలం పేరాపురం గ్రామానికి చెందిన పలువురు కూటమి అభ్యర్థి లోకం నాగమాధవి ఆధ్వర్యంలో జనసేన పార్టీలో చేరారు. ముంజేరు సమీపంలోగల జనసేన పార్టీ కార్యాలయంలో గురువారం రౌతు నరిశింగరావు, రౌతు భాస్కరరావు, వారి అనుచరులు వైసీపీని వీడి జనసేనలో చేరారు.

నిజాయితీగా రాజకీయాలు చేశా: కళా


మాట్లాడుతున్న కిమిడి కళావెంకటరావు

గుర్ల: నీతీ నిజాయితీగా రాజకీయాలు చేశామని చీపురుపల్లి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కిమిడి కళా వెంకటరావు అన్నారు. గుర్లలో గురువారం టీడీపీ నాయకుల ఆత్మీయ కలయిక సభ ఏర్పాటుచేశారు. ఈ సభకు నాలుగు మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు సేవ చేయడమే తమ కుటుంబానికి తెలుసునన్నారు. అక్రమాలు, అన్యాయాలు, దౌర్జన్యాలు తమకు తెలియవన్నారు. అనంతరం పలువురు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గద్దె బాబురావు, కోట్ల సుగుణాకరరావు, కోట్ల మోతిలాలు, తదితరులు పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్' పక్కాగా అమలు చేస్తాం

● బొబ్బిలి ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయన


ప్రచారం నిర్వహిస్తున్న బేబీనాయన

బొబ్బిలి: బొబ్బిలి అసెంబ్లీ టీడీపీ-జనసేన-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్‌వీఎస్‌కేకే రంగారావు (బేబీనాయన) గురువారం పాతబొబ్బిలి గ్రామంలో ఇంటింటి ప్రచారం చేశారు. ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్ సిక్స్ పథకాలు పక్కాగా అమలు చేస్తామని కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు గిరడ అప్పలస్వామి, పాలూరు బాబు, లంక రమేష్, టీడీపీ నాయకులు రాంబార్కి శరత్‌బాబు, పువ్వల శ్రీనివాసరావు, పసుపురెడ్డి లక్ష్మణరావు, సిరిపురపు ధనలక్ష్మి, సజ్జా వెంకటరావు, తూమురోతు వెంకట్, కనకమహేశ్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బాబుతోనే రాష్ట్రానికి మంచి భవిష్యత్తు

● గజపతినగరం ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాస్


మాట్లాడుతున్న శ్రీనివాస్

గంట్యాడ: చంద్రబాబుతోనే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కూటమి అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మదుపాడ గ్రామంలో గురువారం టీడీపీ మండల అధ్యక్షుడు కొండపల్లి భాస్కర్‌నాయుడు ఆధ్వర్యంలో జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ హయాంలో బీసీ కార్పొరేషన్ ద్వారా రాయితీ రుణాలు ఇచ్చారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కొరుపోలు రమేష్‌కుమార్, టీడీపీ నాయకులు అల్లు విజయకుమార్, రంధి చిన రామునాయుడు, బూడి అప్పలనాయుడు, పల్లి వెంకటరావు, బి.రవి, కె.వెంకటేష్ తదితరులు ఉన్నారు.

● జామి: వచ్చే ఎన్నికల్లో కూటమి అధికారంలోకి వస్తే రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య అంతం అవుతుందని ఎమ్మెల్యే అభ్యర్థి కేపీ శ్రీనివాస్ అన్నారు. గురువారం తాండ్రంగి, వన్నె గ్రామాల్లో ఆయన ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

30 కుటుంబాలు టీడీపీలో చేరిక

రామభద్రపురం: కొట్టక్కి గ్రామానికి చెందిన 30 కుటుంబాల వారు వైసీపీని వీడి గురువారం తెలుగుదేశం పార్టీలో చేరారు. టీడీపీ నాయకులు చింతల రామకృష్ణ, మడక తిరుపతినాయుడు, కరణం విజయభాస్కరరావు, ముల్లు రాంబాబుల సమక్షంలో వీరంతా పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వంగపండు అప్పలనాయుడు, భీమునాయుడు, ఎంపీటీసీ సభ్యులు చంద్ర, నర్సాపురం సర్పంచ్ కోట వెంకటనాయుడు, బూసాయవలస సర్పంచ్ ప్రతినిధి గంట సాయికుమార్, కూనిశెట్టి భాస్కరరావు, జన సైనికులు కనకల శ్యామ్, అల్లు రమేష్, టీడీపీ నాయకులు, జనసైనికులు, తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలిక భవనాన్ని సిద్ధం చేయండి


న్యాయవాదులతో చర్చిస్తున్న న్యాయాధికారి వాణి

శృంగవరపుకోట: శృంగవరపుకోట కోర్టుకు అద్దె ప్రాతిపాదికన తీసుకున్న తాత్కాలిక భవనాన్ని త్వరగతిన సిద్ధం చేయాలని జూనియర్ సివిల్ న్యాయాధికారి సబ్బవరపు వాణి న్యాయవాదులకు సూచించారు. నాయవాదు ల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు జి.సూరిదేముడు, బి.సత్యనారాయణ, ఇతర న్యాయవాదులతో గురువారం చర్చించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు అల్లు సత్యాజీ, టీవీ రమణాజీ, గేదల ప్రకాష్, డబ్ల్యూఎన్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో వివాదాలకు చోటివ్వద్దు

రేగిడి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎటువంటి వివాదాలు, గొడవలకు ఆస్కారం ఉండకూడదని, ప్రశాంత ఎన్నికలకు సహకరించాలని డీఎస్పీ ఏఎస్ చక్రవర్తి, ట్రైనీ డీఎస్పీ మహేంద్ర సూచించారు. సోమరాజుపేటలో గురువారం ఎన్నికల నిర్వహణపై ప్రజలతో చైతన్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ బి.ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే

● జిల్లా వ్యాప్తంగా జయంతి కార్యక్రమాలు


కలెక్టరేట్: పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి


విజయనగరం: నివాళులు అర్పిస్తున్న ఎస్టీయూ నేతలు


గజపతినగరం: బీజేపీ కార్యాలయంలో..


లక్కవరపుకోట: జ్యోతిరావు పూలే, సావిత్రీబాయి పూలే వేషధారణలో..

విజయనగరం రూరల్: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా జ్యోతిరావు పూలే, ఆయన సతీమణి సావిత్రిబాయి పూలే ఎంతో కృషి చేశారని కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కలిశెట్టి అప్పలనాయుడు, అదితి గజపతిరాజు చెప్పారు. పూలే జయంతి సందర్భంగా గురువారం కలెక్టరేట్ రోడ్డులో ఉన్న వారి విగ్రహాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు. ● కలెక్టరేట్: జ్యోతిరావు పూలేకి కలెక్టర్ నాగలక్ష్మి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆడిటోరియంలో పూలే జయంతిని గురువారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ కార్తీక్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో అనిత, డీఆర్‌డీఏ పీడీ కళ్యాణ చక్రవర్తి, డీబీసీడబ్ల్యూవో సందీప్ కుమార్ పాల్గొన్నారు. ● బొబ్బిలి: అణగారిన వర్గాల పాలిట ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే అని స్థానిక వైద్యుడు సునీల్‌కుమార్ అన్నారు. పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు. ఉద్యోగ సంఘం నేతలు పాల్గొన్నారు. ● గజపతినగరం: మహాత్మా జ్యోతీరావు పూలే జయంతి వేడుకలను స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దేవర ఈశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు ఏడుకొండలు పాల్గొన్నారు. ● రాజాం రూరల్: మహాత్మా జ్యోతిరావు పూలే సేవలు చిరస్మరణీయమని కూటమి అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ అన్నారు. శ్యాంపురంలోని టీడీపీ క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన పూలే జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. పార్టీ శ్రేణులతో కలిసి నివాళులర్పించారు. ● లక్కవరపుకోట: జమ్మాదేవిపేట వద్దగల మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠ శాలలో గురువారం జ్యోతిరావు పూలే జయంతిని నిర్వహించారు. ప్రిన్సిపాల్ యూవీకే పాత్రో, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ● విజయనగరం దాసన్నపేట: సమన్యాయ సత్యశోధకుడు జ్యోతిరావు పూలే అని ఎస్టీ ఉపాధ్యాయ సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.జోగారావు, చిప్పాడ సూరిబాబులు అన్నారు. జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను కలెక్టరేట్ సమీపంలోని ఆయన విగ్రహం వద్ద నిర్వహించారు. సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు. ● చీపురుపల్లి: జి.అగ్రహారంలోని ప్రజా గ్రంథాలయంలో ఆశయ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జోతీరావు పూలే జయంతి నిర్వహించారు. ఆశయ అధ్యక్షుడు రెడ్డి రమణ, విద్యార్థులు పాల్గొన్నారు.


గజపతినగరం: నమాజ్ చేస్తున్న ముస్లింలు


రామభద్రపురం: ఆరికతోట మసీదులో..


బొబ్బిలి: నమాజ్ చేస్తున్న ముస్లిం చిన్నారులు

భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు

గజపతినగరం: రంజాన్ పండగను స్థానిక సంతతోటలోగల మసీదులో ముస్లింలు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 8 గంటలకే ముస్లింలంతా మసీదుకు చేరుకుని నమాజ్ చేశారు. ● రామభద్రపురం: మండలంలో రంజాన్ సందర్భంగా ముస్లింలు నమాజ్ చేశారు. రామభద్రపురం, ఆరికతోట మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ● బొబ్బిలి: రంజాన్ సందర్భంగా గురువారం స్థానిక కోరాడ వీధి మసీదులో ముస్లింలు ప్రార్థనలు చేశారు. ● చీపురుపల్లి: పట్టణంలోని ముస్లిం సోదరులకు కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కిమిడి కళా వెంకటరావు శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని రామాంజనేయ కాలనీ సమీపంలో ఉన్న ముస్లిం నివాసాలకు వెళ్లి వారిని కలిశారు. శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే గద్దె బాబూరావు, పార్టీ నాయకుడు కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు, తదితరులు ఉన్నారు. ● గంట్యాడ: రంజాన్ సందర్భంగా గంట్యాడ గ్రామంలోని మసీదులో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కూటమి అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ మసీదు వద్దకు వచ్చి, ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎంపీపీ కొండపల్లి కొండలరావు, టీడీపీ మండల అధ్యక్షుడు కొండపల్లి భాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

అనవసర కేసుల్లో ఇరుక్కోవద్దు

బొండపల్లి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అనవసర విషయాల్లో జోక్యం చేసుకుని కేసుల్లో ఇరుక్కోవద్దని ఎస్ఐ లక్ష్మణరావు సూచించారు. ముద్దూరు గ్రామంలో ఎన్నికల నిబంధనలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. నిబంధనలను అతిక్రమించిన వారిపై బైండోవర్ కేసులు నమోదు చేస్తామని చెప్పారు. పాత నేరస్థులతోపాటు పోలీసుల రికార్డుల్లో ఉన్నవారిపై ప్రత్యేక నిఘా ఉంచుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘనపై కేసు నమోదు

బొండపల్లి: ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా సదస్సు నిర్వహించిన టీడీపీ నాయకులపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ లక్ష్మణరావు గురువారం తెలిపారు. కొత్తపాలెం గ్రామంలో టీడీపీ నాయకుడు బొడ్డు రాము ఆధ్వర్యంలో బుధవారం టీడీపీ జయహో బీసీ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సు నిర్వహణకు ముందుగానే అధికారుల నుంచి అనుమతి తీసుకున్నారు. అయితే సభ అనంతరం ప్రాంగణంలో 300 మంది కార్యకర్తలకు భోజనాలు పెట్టడంతోపాటు నిబంధనలు అతిక్రమించి భారీఎత్తున బాణసంచా కాల్చడంతో రాముపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

సీతారామ ఆలయంలో సుగంధ యాగం

గజపతినగరం: స్థానిక సీతారామ గ్రూపు దేవాలయంలోగల సీతారామస్వామి ఆలయంలో గురువారం సుగంధ యాగం నిర్వహించారు. సీనియర్ న్యాయవాది రమేష్‌రాజు సతీసమేతంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే పలువురు మహిళలు సహస్ర నామాలతో ప్రత్యేక పూజలు చేశారు. శ్రీరామనవమి కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టామని ఈవో శ్రీరామ్ తెలిపారు.


సుగంధ యాగం నిర్వహిస్తున్న దృశ్యం

14న మాక్ పాలిసెట్

శృంగవరపుకోట: ఈనెల 14న శృంగవరపుకోట లక్ష్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాక్ పాలిసెట్ నిర్వహిస్తున్నట్లు చీమలపాటి శర్మ, అజ్జాడ నరేష్, వెంపడాపు ఈశ్వరరావు, బండారు మోహన్, షేక్ రహీంలాల్ తెలిపారు. ఎస్.కోట, ఎల్.కోట, వేపాడ, జామి, కొత్తవలస మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్షలు రాయడానికి అర్హులు. కర్రి పవిత్ర లహరి, మండ సత్యసాయితి ఈ పరీక్షలకు ఆర్థిక సాయం చేస్తున్నట్టు తెలిపారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాలుగు, ఐదు స్థానాలు సాధించే వారికి వరుసగా రూ.5వేలు, రూ.3వేలు రూ.2వేలు, రూ.1500, రూ.1000 వంతున అందజేస్తారు. ఆరు నుంచి పది స్థానాలు సాధించిన వారికి రూ.500 చొప్పున నగదు బహుమతులు అందిస్తామన్నారు.

వివాహానికి ఆర్థిక సాయం

బొబ్బిలి: స్థానిక సంస్థానం ఉన్నత పాఠశాలలో 1981లో చదువుకున్న విద్యార్థులంతా ఆనాటి తమ క్లాస్‌మేట్ బారు సత్యనారాయణ చెల్లెలి వివాహ ఖర్చుల కోసం ఆర్థిక సాయం అందించారు. పూర్వ విద్యార్థుల సంఘ ప్రతినిధి, గ్రీన్‌బెల్ట్ సొసైటీ అధ్యక్షుడు ఎస్‌వీ రమణమూర్తి ఆధ్వర్యంలో సత్యనారాయణకు రూ.65 వేలను గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సుంకరిపల్లి శ్రీనివాసరావు, మర్రాపు కూర్మినాయుడు (నాని) తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

రామభద్రపురం: మండల కేంద్రంలోని బైపాస్ రోడ్డు వద్ద నిరంతర నిఘాకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని ఎస్ఐ జ్ఞానప్రసాద్ తెలిపారు. అన్ని ముఖ్య కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ చిన్నయ్య, హెచ్‌సీ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

వడదెబ్బపై అవగాహన

లక్కవరపుకోట (కొత్తవలస): వియ్యంపేట పీహెచ్‌సీ పరిధిలో గల అప్పన్నపాలెం, దత్తి, దన్నిసపేట గ్రామాల్లో వడదెబ్బపై అవగాహన కల్పించారు. పీహెచ్‌సీ వైద్యులు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఉపాధి కూలీల వద్దకు వెళ్లి వడదెబ్బపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆప్తాలమిక్ అధికారి ఈశ్వరరావు, హెచ్ఎస్. ఈశ్వర్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి మొక్కల వితరణ

రాజాం: అమ్మవారి కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న అనాథ, వృద్ధాశ్రమానికి రాజాం రోటరీ క్లబ్ పూర్వ అధ్యక్షుడు టీవీ అచ్యుతకుమార్ రూ.23 వేల విలువ చేసే మొక్కలను వితరణగా గురువారం అందించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు పి.శ్రీనివాసరావు, రెడ్‌క్రాస్ ఛైర్మన్ కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, విశాఖకు చెందిన పృధ్వీరాజ్, బి.హరిచందన, డీఈఈ రవిశేఖర్, పెంకి చైతన్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో బీసీలకు రక్షణ కరువు

దత్తిరాజేరు: వైసీపీ పాలనలో బీసీలకు రక్షణ కరువయ్యిందని టీడీపీ మండల అధ్యక్షుడు చప్ప చంద్రశేఖర్ అన్నారు. కె.కృష్ణాపురంలో గురువారం జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు కనీసం గౌరవం లేకుండా పోయిందన్నారు. మాజీ ఎంపీపీ కొండపల్లి కొండలరావు మాట్లాడుతూ టీడీపీతోనే రాష్ట్ర భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మిత్తిరెడ్డి ఈశ్వరరావు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

● గజపతినగరం: జగన్ అధికారం చేపట్టిన నాటి నుంచి నేటివరకు బీసీలకు తీరని అన్యాయం తలపెట్టారని మాజీ జడ్పీటీసీ మక్కువ శ్రీధర్ అన్నారు. గురువారం ఎం.గుమడాం గ్రామంలో క్లస్టర్ పరిధిలో సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ హయాంలో బీసీ కార్పొరేషన్ల ద్వారా కుల వృత్తులు సాగించేందుకు రుణాలు మంజూరు చేసి ఆదుకున్నారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పీవీవీ గోపాలరాజు, మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి, ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

21న 'ఆదర్శ' ప్రవేశ పరీక్ష

నెల్లిమర్ల: మండలంలోని సతివాడ ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశ పరీక్ష ఈనెల 21వ తేదీన నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎ.ఇందిరాప్రియదర్శిని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష ఉంటుందని చెప్పారు. ఇప్పటికే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు నెట్‌లో హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆమె సూచించారు. ప్రవేశ పరీక్ష ఐదో తరగతి స్థాయిలో ఉంటుందని, తెలుగు, ఇంగ్లీషు మీడియంలలో రాయవచ్చని ఆమె చెప్పారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

బొండపల్లి: ప్రతిఒక్కరూ తప్పనిసరిగా సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన నిబంధనలు పక్కాగా పాటించాలని ఎంపీడీవో ఎస్.హరిహరరావు సూచించారు. మండలంలోని బి.రాజేరు, ఎం.కొత్తవలస, చిన్నతామరాపల్లి గ్రామాల్లో ఆయన గురువారం పర్యటించి, ఎన్నికల నిబంధనలు అమలు ప్రక్రియను పరిశీలించారు. ఈసందర్భంగా గ్రామస్థులకు ఎన్నికల నిబంధనలపై అవగాహన కల్పించారు. ఏ రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలుగానీ, పోస్టర్లుగానీ ఇళ్ల వద్ద, గ్రామాల్లోని గోడలు, ముఖ్య కూడళ్ల వద్ద అనుమతి లేకుండా ఏర్పాటు చేయవద్దని సూచించారు. అలాగే నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు కఠినంగా ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

అన్ని హంగులతో లాడ్జి ఏర్పాటు హర్షణీయం


లాడ్జిని ప్రారంభిస్తున్న రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి

విజయనగరం: అభివృద్ధి చెందుతున్న విజయగనరం పట్టణంలో అన్ని హంగులు.. వసతులతో కూడిన లాడ్జి, హోటల్‌ను ప్రారంభించడం హర్షించదగ్గ విషయమని ఎంపీ(రాజ్యసభ) వైవీ సుబ్బారెడ్డి వెల్లడించారు. గురువారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌కు సమీపంలో మెడికవర్ ఆసుపత్రికి ఎదురుగా హోటల్, లాడ్జిని ప్రారంభించారు. సుదూర ప్రాంతాల నుంచి విజయనగరం వచ్చిన వారికి అన్ని వసతులతో కూడిన లడ్జి లభ్యం అయ్యేలా ఏర్పాట్లు చేశారని చెప్పారు. అందరికీ అందుబాటులో నగర నడిబొడ్డున ఏర్పాటు చేయటం మంచి పరిణామమన్నారు. హోటల్.. లడ్జి అధినేత కుప్పిలి శ్రీను దంపతులను వైవీ సుబ్బారెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, బొత్స అప్పలనరసయ్య, నగర మేయర్ విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు రాకతో రహదారికి మరమ్మతులు


గోతులు పూడుస్తున్న దృశ్యం

రాజాం: మాజీ సీఎం నారా చంద్రబాబునాయుడు ఈనెల 15న ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా స్థానిక అంబేద్కర్ కూడలి వద్ద రోడ్డుషో నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో అంబేద్కర్ కూడలి నుంచి జీఎంఆర్ ఐటీ వరకు రోడ్డుకు గురువారం మరమ్మతులు చేపట్టారు. ఈ విధంగా అయినా ప్రధాన రహదారికి మోక్షం కలుగుతుందని... తమ ఇబ్బందులు తీరుతాయని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

చీపురుపల్లి: చీపురుపల్లి లయన్స్ క్లబ్ నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి గరివిడి పట్టణానికి చెందిన మజ్జి కమలాకర్ అనే వ్యక్తి రూ.30వేలు విరాళంగా ఇచ్చారు. క్లబ్ ప్రతినిధులను గురువారం ఈ మొత్తాన్ని అందజేశారు.